క్లుప్తంగా

నియామకం



రేగొండ: తెలంగాణ మాల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా వేముల నరేందర్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొనుగంటి మధుకర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. మాల కులస్తుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. తన నియమకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విచారణ చేపట్టాలి

ఏటూరునాగారం: వాజేడులోని ఆశ్రమ గిరిజన పాఠశాలలో వినీత్ జ్వరంతో తల్లిదండ్రుల వద్ద ఉండగా మృతి చెందాడు. దీంతో మృతికి గల కారణాలను గుర్తించాలని డీడీ పోచం, తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా ఆదివారం ఆదేశించారు. విద్యార్థి ఏ విధంగా మృతి చెందాడని, పాఠశాల యజమాన్యం నిర్లక్ష్యం ఏమైనా ఉందా అనే కోణంలో ఆరాతీయాలన్నారు. దీనిపై వైద్యులు సైతం విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని పీఓ ఆదేశించారు.

టేకుమట్లలో కలపాలి

టేకుమట్ల: చిట్యాల మండలంలో ఉన్న గిద్దెముత్తారం, కాల్వపల్లి గ్రామాలను టేకుమట్ల మండలంలో కలపాలని ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం ఎమ్మెల్యే సత్యనారాయణరావుకు జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిద్దెముత్తారం, కాల్వపల్లి గ్రామాల నుంచి చిట్యాల మండల కేంద్రానికి వెళ్లాలంటే టేకుమట్ల మండలం దాటుకుంటూ 23 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తమ గ్రామాలను టేకుమట్ల మండలంలో కలుపాలని వేడుకున్నారు.

వివరాల నమోదుకు మరో అవకాశం

ఆత్మకూరు : సమగ్ర ఇంటింటి సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారు ఈనెల 28లోగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర ఇంటింటి సర్వేలో ఇప్పటివరకు నమోదు చేసుకోని వారు ప్రజా పాలన కేంద్రాల్లో సమాచారం అందించాలని, గతంలో తాళం వేసి ఉన్న ఇళ్లు, ఆసక్తి లేకపోవడం తదితర కారణాల వలన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణన ఇంటింటి సర్వే హౌస్‌లిస్ట్‌లో ఉండి సర్వే చేయని కుటుంబాలకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. టోల్-ఫ్రీ నంబర్ 040-21111111కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య కాల్ చేసి సమాచారం అందజేయవచ్చునన్నారు.

నిరుపయోగంగా వాటర్ ప్లాంట్లు

- నిధులు నీళ్లపాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఎంపేడులో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్ పరికరాలు

టేకుమట్ల: ప్రజలు ఫ్లోరోసిస్ బారినపడకుండా ఉండేందుకు ఫ్లోరైడ్ రహిత తాగు నీటిని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో 2015-16 సంవత్సరంలో ప్రభుత్వం మండలంలోని ఎంపేడు, ద్వారకపేట, అంకుషాపూర్, టేకుమట్ల గ్రామాలకు ఎంపీ నిధుల నుంచి ఒక్కో మినరల్ వాటర్ ప్లాంట్‌కు రూ.2.5లక్షలను మంజూరు చేసింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను తొలినాళ్లలో వాడి నిర్వహణ లోపం, భారంతో వదిలేయడం వలన ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికీ కనీసం గ్రామ పంచాయతీ నిధుల నుంచి మరమ్మతులు చేపించి వినియోగంలోకి తీసుకువచ్చినా గ్రామస్తులకు రక్షిత మంచినీటి సౌకర్యం అందుబాటులో ఉంటుంది. కానీ సంవత్సరాలుగా మూలన పడేయడంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్న గ్రామస్తులు

కలుషిత నీరు, ఫ్లోరోసిస్ నీటిని తాగితే అనారోగ్య భారిన పడతారనే భావనతో ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు మినరల్ వాటర్‌నే తాగుతున్నారు. పలు గ్రామాల్లో బాల వికాస, కొన్ని గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ల నుంచి నీటిని కొనుగోలు చేసి వినియోగించుకుంటున్నారు. మానేరు, చలివాగు పరివాహక ప్రాంత ప్రజలు ఇప్పటికీ కొంత మంది వాగు నీటినే తాగునీరుగా వినియోగిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్‌లు అందుబాటులో లేని గ్రామాల్లో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల వద్దకు వెళ్లి నీటిని తీసుకుంటున్నారు. ఇప్పటికైనా ఎంపీ నిధుల నుంచి మంజూరైన వాటర్ ప్లాంట్‌లను వినియోగంలోకి తీసుకువస్తే మరింత మందికి రక్షిత మంచినీరు అందుబాటులోకి వస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



గతంలో గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. ప్రభుత్వం మంజూరు చేసిన వాటర్ ప్లాంట్‌ను వాడకపోవడంతో ప్రైవేట్ ప్లాంట్ల వద్ద నీటిని కొనుక్కుంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేపించి, ప్రత్యేక రూం ఏర్పాటు చేస్తే ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

- దానవేని ఓదేలు, అంకుషాపూర్

నీటిని కొనుగోలు చేస్తున్నాం..



ప్రభుత్వం నుంచి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ ప్లాంట్ నుంచి ప్రతీ రోజు నీటిని కొనుగోలు చేస్తున్నాం. మంజూరైన వాటర్ ప్లాంట్‌ను రిపేర్ చేపిస్తే అందరికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. నీటిని కొనలేక చాలా మంది గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న నీటినే తాగుతున్నారు. వర్షాకాలంలో కలుషిత నీటిని తప్పనిసరి పరిస్థితుల్లో తాగాల్సిన పరిస్థితి. వాటర్ ప్లాంట్‌ను మరమ్మతు చేయాలి.

- ఎలవేని భాగ్య, టేకుమట్ల

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

- పస్రా ఎస్సై అచ్చ కమలాకర్



తనిఖీ చేస్తున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బందితో ఎస్సై ఆదివారం ఇసుక లారీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక లారీల యజమానులు డీడీలు లేకుండా తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా క్వారీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఒక లారీకి బదులు మరోక దానిలో ఇసుకను తరలించిన, ఓవర్ లోడ్ ఉన్న, జేసీబీ లోడింగ్ చార్జీల పేరుతో అక్రమ వసూళ్లు చేసిన చర్యలు ఉంటాయని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

చిట్యాల: మండల కేంద్రంలోని స్థానిక హైస్కూల్‌లో 2010-11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సారంగాపాణి, వెంకటేశ్వర్లు, రవీందర్, రఘు, కుమార్, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, సురేష్ వెంకటేశ్, నాగరాజ్, పాషా, సంధ్య, శిరీష, అమనీ, మౌనిక పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు వేడుకలు



ఉర్సు వేడుకల్లో ముస్లిం మతపెద్దలు

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: ముప్పనపల్లి గ్రామంలో సయ్యద్ మహమ్మద్ షా వలి దర్గాలో ఉర్సు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు దర్గాలో పీఠాధిపతి నజీరోద్దీన్ ఆధ్వర్యంలో చాదర్లు, గంధం ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముజావర్ ఇంటి నుంచి గంధాన్ని తీసుకువచ్చి దర్గాలో దువా చేశారు. కార్యక్రమంలో మునాత్రే అఫ్లా, మౌలానా ఖజా, జాఫరుల్ అబేదిన్, హఫీజ్ అబ్దుల్ రహమాన్, అజార్, షౌకత్ అలి, ఇబ్రహీం, అప్సర్ అలిఖాన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఆత్మకూరు : శ్రీనివాస రామానుజన్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్టులో మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ లిస్ మేరీ తెలిపారు. 8వ తరగతి విద్యార్థిని చిట్టిబొమ్మల నిక్షిత స్టేట్ టాపర్‌గా, పదో తరగతి విద్యార్థి కేతిడి నితిన్‌రెడ్డి జిల్లా టాపర్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు. అలాగే కీర్తన, ఉదయ్‌చంద్ర ,హర్షిత్‌రెడ్డి, అక్షర, అశ్వద్‌వర్మ ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సిస్టర్ జాయిస్, వైస్ ప్రిన్సిపాల్ రోస్మి హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

దామెరలో..

దామెర : శ్రీనివాసా రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాథ్స్ అండ్ సైన్స్ ఒలింపియాడ్‌లో మండలంలోని ఒగ్లాపూర్ డిస్నీల్యాండ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి 5,6 ర్యాంకులను సాధించారు. ఆదివారం హనుమకొండ కాకతీయ యూనివర్సిటీలో జరిగిన ఒలింపియాడ్ బహుమతుల ప్రదానోత్సవంలో పాఠవాలలో 8వ తరగతికి చెందిన ఎడ్డె సాయిశ్రీరామ్ 5వ ర్యాంకు సాధించగా, అదే తరగతికి చెందిన జాడి కేశవ 6వ ర్యాంకు సాధించగా, ముద్దురి శ్రీకాంత్, కోరే ప్రమోద్ సాయి, అజ్మీర వినయ్, ఎండి.రెహాన్ జిల్లాస్థాయిలో నిలిచారు. అలాగే జిల్లాస్థాయి కన్సోలేషన్ బహుమతులు మధుశ్రీ, పెరుగు అరుష్, ప్రనోజ్, నితిన్, సుశాంత్, సాయితేజ, బిందు, సాయిహర్ష, శ్రీనందన్‌రెడ్డి సాధించినట్లు పాఠశాల ముఖ్య సలహాదారుడు దయ్యాల మల్లయ్య తెలిపారు. సదయ్య, లక్ష్మీనివాసం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



గోవిందరావుపేట: పరామర్శిస్తున్న నాయకులు

గోవిందరావుపేట: మండలంలోని కర్లపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అప్పయ్య భార్య సారమ్మ అనారోగ్యంతో, బుస్సాపూర్ గ్రామానికి చెందిన కట్ల నర్సిరెడ్డి, హైమత్ అలీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదివారం పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేలను అందజేశారు. అలాగే పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ రూ.10 వేలను ఈక అప్పయ్య ఆర్థిక సాయం చేశారు. నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, జెట్టి సోమయ్య, రసపుత్ సీతారాం నాయక్, పన్నాల ఎల్లారెడ్డి, చింత క్రాంతి, భేతి రవీందర్ రెడ్డి, పాలెం యాదగిరి, తిప్పారపు రాజబాబు, భరత్, ఈక జగ్గారావు, పెండెకట్ల బాలరాజు, కొల్లు శ్రీనివాస్ రెడ్డి, గొంది కిరణ్, పంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మడిపడగ లక్ష్మీనారాయణరావు, మండల కేంద్రానికి చెందిన పిట్టల అఖిలశ్రీ,, ఆరెపల్లి ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, ఎంపీటీసీల సంఘం మండల మాజీ అధ్యక్షుడు జంబుల తిరుపతి, అనిల్, నాగరాజు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల అనుగ్రహం ప్రజలపై ఉండాలి


ఆత్మకూరు : సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల అనుగ్రహం ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మను ఆదివారం ఆయన దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. భక్తులు పోటెత్తడంతో అగ్రంపహాడ్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, పర్వతగిరి రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన లక్నవరం నీటిమట్టం

- జలాశయంలో 24 అడుగులకు నీరు
- ఆందోళనలో అన్నదాతలు
- అడుగంటితే పర్యాటకంపై కూడా తీవ్ర ప్రభావం
- కలగానే రామప్ప నీళ్ల తరలింపు



తూము వద్ద 24 ఫీట్లు ఉన్న నీటి మట్టం



లక్నవరంలోని ఉయ్యాల వంతెన వద్ద నీటి మట్టం

గోవిందరావుపేట: లక్నవరం చెరువు కింద వ్యవసాయ అవసరాలకు భారీగా నీటి వినియోగం జరుగుతుండడంతో రోజురోజుకు నీటి మట్టం తగ్గిపోతుంది. ఆదివారం నాటికి లక్నవరం జలాశయంలో 24 ఫీట్ల నీరు మాత్రమే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు ప్రారంభ దశలోనే నీరు తగ్గడంతో చివరి వరకు సరిపోతాయో లేదో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే నీరు అడుగంటితే పర్యాటక రంగానికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. దేవాదుల ఎత్తిపోతల పథకానికి బ్యాలెన్స్ రిజర్వాయర్‌గా ఉన్న రామప్ప చెరువు నుంచి లక్నవరానికి జలాలను తరలించే ప్రయత్నం భూసేకరణ స్థాయిలోనే నిలిచింది.

రెండేళ్లుగా ఎండుతున్న లక్నవరం

గడిచిన రెండేళ్లలో నీళ్లు లేక లక్నవరం చెరువు పూర్తిగా ఎండిపోతుంది. దీంతో వేలాడే వంతెనల కింది నుంచి మట్టి రోడ్ల మీద వాహనాలు సైతం ప్రయాణించాయి. ఈ సారి కూడా చెరువులో రోజు రోజుకి నీటి మట్టం తగ్గుతుంది. ఇప్పటికే నీటి మట్టం 24 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిగా తగ్గి యాసంగి పంటకు, టూరిజానికి కష్ట కాలం తప్పేటట్లు లేదని స్థానికులు వాపోతున్నారు.

నిలిచిన కెనాల్ పనులు

లక్నవరం జలాశయానికి రామప్ప చెరువు నుంచి నీటిని తరలించాలని, అందుకు 7.5 కిలోమీటర్లు కాల్వలు తవ్వి గ్రావిటీతో నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. 2019లో రూ.14.53 కోట్లు మంజూరు చేయగా టెండర్లు కూడా పూర్తయ్యాయి. కాల్వ నిర్మాణానికి 145.36 ఎకరాల భూములు అవసరం కాగా, ఎకరానికి 2.47 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. భూములకు మంచి డిమాండ్ ఉండడంతో రైతులు ఒప్పుకోకపోవడంతో పరిహారాన్ని ఎకరానికి రూ.8 లక్షలకు పెంచాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. కాగా, ఐదు సంవత్సరాలు గడిచిపోవడంతో నిర్మాణ వ్యయం రెట్టింపు అయిందని, పాత టెండర్లకు అనుగుణంగా పనులు చేయలేమని కాంట్రాక్టర్ సైతం చేతులెత్తేశాడు. దీంతో కెనాల్ పనులు భూసేకరణ స్థాయిలోనే నిలిచి పోయాయి.

పంటలకు సాగునీరు కష్టమేనా!

అధికారులు లక్నవరం జలాశయం కింద యాసంగి పంటకు రెండు ప్రధాన కాల్వలు నర్సింహుల కాల్వ, శ్రీరాంపతి కాల్వ కింద 4150 ఎకరాలకు తైబందీ ఖరారు చేశారు. కాగా, అనధికారికంగా ఇదే రెండు కాల్వలపై మోటార్ల సహాయంతో మరో 500 ఎకరాలు పంట పండిస్తున్నారు. అంతే కాకుండా పంట కాల్వలు సరిగా లేక చాలా వరకు నీరు వృథా అవుతుంది. 4150 ఎకరాల పంటకు నీరు అందదు అని రైతులు అధికారులకు ఎంత విన్నవించుకున్న అదేమి పట్టనట్లు తైబందీ ఖరారు చేశారు. కాగా,



ప్రస్తుతం జలాశయంలో నీటి మట్టం తగ్గడంతో చివరి వరకు నీరు వస్తాయో రావో అనే ఆందోళనలో రైతులు ఉన్నారు. కాల్వల ద్వారా నీరు వృథాగా వెళ్లకుండా చూసి చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

పర్యాటకంపై తీవ్ర ప్రభావం



లక్నవరం సరస్సుకు పొంచి ఉన్న నీటి సమస్య పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇప్పటికే ఎండలు రోజు రోజుకి పెరుగుతున్న క్రమంలో నీటి మట్టం తగ్గుతూ పోతుంది. అంతే కాకుండా అందులో ఉన్న నీరు వ్యవసాయం రంగానికి వినియోగిస్తున్నారు. నీటి మట్టం పూర్తిగా తగ్గినట్లయితే లక్నవరం జలాశయంలో నిర్వహించే వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్, బోటింగ్ మూలనపడనున్నాయి. దీంతో పర్యాటకుల సంఖ్య కూడా తగ్గుతుంది.

నీటి మట్టం తగ్గింది..



ఇప్పటికే చెరువులో నీటి మట్టం ఇప్పటికే తగ్గింది. దీనికి తోడు ఎండలు ఈ సారి బాగా ఉండేలా ఉన్నాయి. పంటలు ఎండిపోతాయన్న భయం వెంటాడుతుంది. ఇదే జరిగితే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్పందించి రామప్ప నుంచి లక్నవరానికి నీటిని తరలించే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి.

- వాసం స్వామి, ఆయకట్టు రైతు

నీటిని వృథా చేయొద్దు

లక్నవరంలో ఉన్న నీటిని రైతులు జాగ్రత్తగా వాడుకోవాలి. కాల్వలపై షటర్లు బిగిస్తున్నాం, నీటిని వృథా చేయొద్దు. ప్రస్తుతం 24 ఫీట్లు ఉన్నాయి. రైతులు వృథా చేయకుండా వాడుకుంటే సాగుకు సరిపోతాయి.

- కొట్టెం నారాయణ, ఈఈ, నీటి పారుదల శాఖ, ములుగు

దేవాదుల మోటారు బంద్ చేయాలని నిరసన

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారులో గల దేవాదుల పంపుహౌజ్ ఎదుట ధర్మసాగర్‌కు వెళ్లే మోటారు బంద్ చేయాలని ఆదివారం మైలారం, పత్తిపాక, హుస్సేన్‌పల్లి గ్రామాల రైతులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రైతు బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. జోగంపల్లి దేవాదుల పంపుహౌజ్ నుంచి ధర్మసాగర్‌కు పంపింగ్ చేసే మోటార్‌ను వెంటనే బంద్ చేయాలని, గతంలో రెండు మోటార్లు నడువగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు ఆదేశాల మేరకు ఒక మోటారు బంద్ చేసినట్లు తెలిపారు. ఆ ఒక్క మోటారు కూడా కొన్ని రోజులు బంద్ చేయాలని కోరారు. ఇప్పటికీ చలివాగు ప్రాజెక్ట్ కాల్వ మరమ్మతు కోసం క్రాప్ హాలీడే ప్రకటించామని తెలిపారు. అధికారులు చొరవ చూపి కొన్ని రోజులు ధర్మసాగర్ సాగునీరు పంపింగ్ చేసే మోటారును బంద్ చేసి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



మంగపేట: జిల్లా సరిహద్దు ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం దుగినేపల్లి, చేగర్శల గ్రామాల మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కొత్తమల్లూరు గ్రామానికి చెందిన మాటూరి హన్మంతరావు(47) అక్కడిక్కడే మృతి చెందారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని గీసరెల్లికి చెందిన మునిగెల నాగేశ్వర్‌రావుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల కుటుంబ సభులు తెలిపిన వివరాల మేరకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని అడవి కమలాపురానికి చెందిన గుమ్మల రామస్వామి పెద్ద కుమార్తె పుష్పావతిని నాగేశ్వర్‌రావు, రెండో కూతురు వరలక్ష్మిని హన్మంతరావు వివాహం చేసుకున్నారు. కొత్తమల్లూరులో ఉంటున్న హన్మంతరావు వద్దకు నాగేశ్వర్‌రావు వచ్చి ఇద్దరు కలిసి ఆదివారం అడవి కమలాపురంలోని అత్త వారి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. మార్గ మధ్యలోని దుగినేపల్లి, చేగర్శల గ్రామాల మధ్య మణుగూరు వైపు నుంచి వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు రోడ్డుపై పడటంతో హన్మంతరావు అక్కడిక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన నాగేశ్వర్‌రావును మణుగూరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం నాగేశ్వర్‌రావు కోమాలోకి వెళ్లడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెల భర్తలు రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మృతుడు హన్మంతరావుకు శంకరమ్మ, వరలక్ష్మి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనారోగ్యంతో యువకుడు..



సురేందర్ (ఫైల్)

కన్నాయిగూడెం: కిడ్నీల సమస్యతో అనారోగ్యానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కంతనపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం కంతనపల్లికి చెందిన సురేందర్ కుమార్‌కు(28) కిడ్నీల సమస్యలు రావడంతో కొన్ని రోజుల నుంచి బాధపడుతూ.. శనివారం మృతి చెందినట్లు తెలిపారు. కాగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు అప్సర్‌పాషా, మండల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రాంబాబు, గద్దం నాగేష్ తదితరులు ఉన్నారు.

హమాలీ కార్మికుడు..



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన సివిల్ సప్లై హమాలీ కార్మికుడు ఆరెపల్లి ఎల్లయ్య(53) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. కాగా, మృతుడికి ముగ్గురు కూమార్తెలు ఉండడంతో అతడికి చిన్న కుమార్తె తలకొరివి పెట్టింది. అలాగే బాధిత కుటుంబాన్ని సివిల్ సప్లై గోదాం ఇన్‌చార్జ్ రాజు పరామర్శించి రూ. 20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట హమాలీ కార్మికులు సురేష్, ఆరెపల్లి సమ్మయ్య, కట్కూరి కుమార్, ముత్యాల మధు, శీలపాక రాజు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతవుతున్న అవెన్యూ ప్లాంటేషన్



అగ్నికి ఆహుతవుతున్న చెట్లు

శాయంపేట : మండలంలోని మాందారిపేట శివారులో గల కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల ప్రహరీ ఆవరణలో గత చెత్తను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో అవెన్యూ ప్లాంటేషన్ చెట్లు కాలిపోయాయి. హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకిరువైపులా నాటిన చెట్లు అగ్నికి ఆహుతి అవ్వడంతో పర్యావరణ ప్రేమికులు ఆగ్రహిస్తున్నారు. మాందారిపేట గ్రామ శివారు నుంచి గోవిందాపూర్ స్టేజీ వరకు తరచూ అవెన్యూ ప్లాంటేషన్‌లో చెట్లకు నిప్పంటిస్తుండడంతో అధికారులు ఇప్పటి వరకు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.